సాక్షి
అనంతపురం
మంగళవారం | 30 | మే | 2023

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..


టవర్‌క్లాక్ బ్రిడ్జిపై బైక్ ర్యాలీతో వస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

- టవర్‌క్లాక్ బ్రిడ్జిపై రాకపోకలు షురూ
- ఎమ్మెల్యే అనంత ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ


ర్యాలీలో ఎమ్మెల్యే అనంత అభివాదం

అనంతపురం క్రైం: జిల్లా కేంద్రం అనంతపురానికి మణిహారమైన టవర్‌క్లాక్ బ్రిడ్జిపై సోమవారం రాకపోకలు మొదలయ్యాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో వేలాదిమందితో నిర్వహించిన బైక్ ర్యాలీతో బ్రిడ్జిపై రాకపోకలు ప్రారంభమయ్యాయి. బళ్లారి బైపాస్‌లోని ఎంజీ పెట్రోల్ బంక్ నుంచి బ్రిడ్జి మీదుగా టవర్ క్లాక్, సప్తగిరి సర్కిల్, ఐరన్‌బ్రిడ్జ్, గాంధీ బజార్, శ్రీకంఠం సర్కిల్, రైల్వే ఫీడర్ రోడ్డు, ఆర్ట్స్ కళాశాల వరకు ఉల్లాసంగా.. ఉత్సాహంగా ర్యాలీ సాగింది. ఎమ్మెల్యే 'అనంత' పార్టీ జెండా పట్టుకుని ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకుసాగారు. ఆర్ట్స్ కళాశాల వద్ద ఎమ్మెల్యే అనంతను పార్టీ కార్యకర్తలు భుజాలపైకి ఎత్తుకుని ఊరేగించారు. జై జగన్.. జై అనంత అంటూ నినదించారు. నూతన బ్రిడ్జిని తిలకించేందుకు వేలాదిమంది ప్రజలు తరలిరావడంతో టవర్‌క్లాక్ – పీటీసీ వరకు పండుగ వాతావరణం కనిపించింది.

'అనంత'లో రూ.650 కోట్ల అభివృద్ధి

కోవిడ్‌తో ఏడాదిన్నర కాలం గడిచిపోయినా...మిగతా రెండున్నరేళ్లలో అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో రూ.650 కోట్లతో రోడ్లు, డ్రెయినేజీలు తదితర అభివృద్ధి పనులు చేశామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. టీడీపీ హయాంలో ఆర్‌అండ్‌బీ పరిధిలోకి తీసుకొచ్చిన ఫ్లై ఓవర్‌ను ఎన్‌హెచ్ పరిధిలోకి తీసుకొచ్చి అభివృద్ధి చేసి.. ట్రాఫిక్ కష్టాలు తీర్చాలని ఎంపీ తలారి రంగయ్యతో కలిసి సీఎం దృష్టికి తీసుకుపోయామన్నారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించి అర్బన్ లింక్ ప్రాజెక్ట్ కింద రోడ్ల విస్తరణతో పాటు టవర్‌క్లాక్ బ్రిడ్జిని కూల్చి.. దాని స్థానంలో కొత్తగా నాలుగు వరసలతో బ్రిడ్జి నిర్మించేందుకు కేంద్రం దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయించారన్నారు. ప్రస్తుతం సప్తగిరి సర్కిల్, శాంతి థియేటర్ వద్ద పనులు, బ్రిడ్జ్ కింద అండర్ పాస్ పనులను మరో మూడు నెలల్లో పూర్తి చేస్తామన్నారు.రూ.311.93 కోట్లతో నిర్మించిన టవర్‌క్లాక్ బ్రిడ్జ్ ఫోర్‌వేను సీఎం జగన్, కేంద్ర మంత్రులు త్వరలో అధికారికంగా ప్రారంభిస్తారన్నారు. అంతవరకు ఇలాగే ఉంటే ట్రాఫిక్‌తో ప్రజలు మరింత ఇబ్బంది పడతారని భావించి ముందస్తుగా బ్రిడ్జిపై రాకపోకలు మొదలయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. 16 నెలల్లోనే బ్రిడ్జ్ నిర్మాణం పూర్తి చేశారని, ఎస్ఆర్‌సీ, ఎన్‌హెచ్, ఆర్‌అండ్ బీ, నగరపాలక, రెవెన్యూ, పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు.

క్లుప్తంగా

1 నుంచి భూముల మార్కెట్ విలువ పెంపు

అనంతపురం టౌన్: భూముల మార్కెట్ విలువ పెంపుపై రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు కసరత్తు పూర్తి చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 21 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో గల రెవెన్యూ గ్రామాల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో భూముల విలువ పెంపు చేసినట్లు జిల్లా రిజిస్ట్రార్ నాగభూషణం తెలిపారు. 20 నుంచి 100 శాతం వరకు కొన్ని ప్రాంతాల్లో మార్కెట్ విలువ పెంచే దిశగా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. పెంచిన మార్కెట్ రేట్ల వివరాలను ఆయా సబ్ రిజిస్ట్రార్ పరిధిలోని అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను చేపట్టినట్లు తెలిపారు. పెరిగిన మార్కెట్ ధరలు జూన్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తాయన్నారు. ఈ విషయాన్ని స్థిరాస్తుల క్రయవిక్రయదారులు గమనించాలని సూచించారు.

'పోలీసు స్పందన'కు 118 వినతులు



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 118 వినతులు అందాయి. ఎస్పీ కె.శ్రీనివాసరావు స్వయంగా అర్జీదారులతో వినతులు స్వీకరించి, సమస్య తీవ్రతపై ఆరా తీశారు. అనంతరం చట్టపరిధిలోని సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అనంతపురం డీఎస్పీ జి.ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

ముగ్గురు విద్యార్థుల డీబార్

రాప్తాడు రూరల్: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో భాగంగా సోమవారం ముగ్గురు విద్యార్థులు డీబార్ అయ్యారు. అనంతపురంలో శ్రీచైతన్య కళాశాల పరీక్ష కేంద్రంలో ఇద్దరు, నారాయణ కళాశాల కేంద్రంలో ఓ విద్యార్థి మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతూ రాష్ట్ర పరిశీలకులు రమణ గుప్త కంటపడ్డారు. దీంతో ఈ ముగ్గురిని ఆయన డీబార్ చేశారు. కాగా, సోమవారం జరిగిన ఫిజిక్స్–1, ఎకనామిక్స్–1, ఫిజిక్స్–2, ఎకనామిక్స్–2, ఒకేషనల్ పరీక్షలకు 733 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం 77 కేంద్రాల్లో జరిగిన మొదటి సంవత్సరం జనరల్, ఒకేషనల్ పరీక్షలకు 11,302 మంది విద్యార్థులకు గాను 11,825 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 77 కేంద్రాల్లో జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 4,078 మంది విద్యార్థులకు గాను 3,868 మంది హాజరయ్యారు.

నవశకానికి నాలుగేళ్లు

- సంక్షేమం.. అభివృద్ధి దిశగా జగన్ సర్కార్ నాలుగేళ్ల పాలన
- కుల, మత, రాజకీయాలకతీతంగా ప్రజలకు నేరుగా లబ్ధి
- ఉమ్మడి అనంత జిల్లాలో పారిశ్రామికంగా కొత్త శకం
- పీహెచ్‌సీలు, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లతో ఆరోగ్యానికి పునరుజ్జీవం
- అనంత మెడికల్ కాలేజీకి భారీ వ్యయంతో కొత్త భవనాలు
- జగనన్న కాలనీల ఏర్పాటుతో నెరవేరిన పేదల సొంతింటి కల
- సచివాలయాలతో ఇంటి వద్దకే పాలన
- ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌తో పల్లె ముంగిటకే వైద్యం
- రీ సర్వే, చుక్కల భూములకు విముక్తి

సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రంలో ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి.. పోయాయి. ఎందరో ముఖ్యమంత్రులు వచ్చారు.. వెళ్లారు. కానీ గత చరిత్రలను తిరగరాసి, గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని ఏర్పాటు చేసి కొత్త చరిత్రకు నాందిపలికింది వైఎస్ జగన్ సర్కార్. దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ అమలుచేయని విధంగా గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా సేవల్లో కొత్త ఒరవడి నాంది పలికింది. సంక్షేమం అంటే ప్రజలు..ప్రజలంటేనే సంక్షేమం అన్న పదానికి నిర్వచనం చెప్పింది. రేషన్ కార్డు మొదలుకొని సామాజిక పెన్షన్ల వరకూ కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులకు అందజేస్తూ అందరి ప్రభుత్వంగా పేరుగాంచింది... ఇలా వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో లెక్కలేనన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి పేదల ముఖాల్లో చిరునవ్వు చిందేలా చూస్తోంది.

చదువులకు పెద్దపీట

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది స్కూళ్లలో నాడు నేడు పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వ బడులు ప్రైవేటు స్కూళ్లను తలపిస్తున్నాయి. అడ్మిషన్ల సంఖ్య భారీగా పెరిగింది. డ్రాపౌట్లు తగ్గుముఖం పట్టాయి. ప్రతి తల్లీ తన బిడ్డను బడికి పంపితే అమ్మఒడి కింద రూ.15 వేలు ఇస్తున్నారు. స్కూళ్లలో మరుగుదొడ్ల నుంచి మంచినీళ్ల కుళాయిల వరకూ అన్నీ ఏర్పాటు చేశారు. ఇదొక్కటే కాదు ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెనకు నేరుగా సొమ్ములిస్తున్నారు. విదేశీ విద్యాదీవెన ద్వారా ఒక్కో విద్యార్థిపై గరిష్టంగా రూ.కోటి ఖర్చు చేసే జగనన్న విదేశీ విద్యాదీవెన అందుబాటులోకి తెచ్చి పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందుబాటులోకి తెచ్చారు.

చుక్కల భూములకు విముక్తి

గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా వైఎస్సార్ సీపీ సర్కారు వందేళ్ల క్రితం ఉన్న రికార్డులను సవరించి రీసర్వే చేపట్టింది. వివాదాల్లేని భూముల చిట్టాను తయారు చేస్తోంది. ఇప్పటికే అనంతపురం జిల్లాలో 43 గ్రామాల్లో సర్వే పూర్తయింది. అలాగే 22–ఏలో ఉన్న భూములపై సాగుదారులకు హక్కు ఉండేదికాదు. జగన్ సర్కారు అలాంటి భూములన్నిటికీ విముక్తి కల్పించి రైతులకు సంపూర్ణ హక్కులు కల్పించింది.

మెడికల్ కాలేజీలకు మహర్దశ


అనంతపురం మెడికల్ కాలేజీకి మహర్దశ వచ్చింది. రాష్ట్రంలో జగన్ సర్కార్ కొలువుదీరినప్పటి నుంచి ఇప్పటివరకూ అనంత మెడికల్ కళాశాలకు ఏకంగా 70 పీజీ సీట్లు అదనంగా వచ్చాయి. మరో రూ.450 కోట్లతో అదనపు కాలేజీకి కొత్త భవనాలకు పనులు ప్రారంభమయ్యాయి. ఇక శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ వద్ద మెడికల్ కాలేజీ ఏర్పాటు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. 2026 నాటికి ఈ కాలేజీ అందుబాటులోకి రానుంది.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో కొత్త చరిత్ర

ఫ్యామిలీ ఫిజీషియన్ వ్యవస్థ దేశంలోనే కొత్త చరిత్ర సృష్టించింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రజల వద్దకే వైద్యం వెళ్లింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఫ్యామిలీ ఫిజీషియన్‌తో కొత్త భరోసా వచ్చింది. ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ విధానంలో డయాబెటిక్, హైపర్ టెన్షన్‌తో పాటు పలు అసాంక్రమిక వ్యాధులను గుర్తించి వైద్యం చేస్తున్నారు.

ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులు

ఒకప్పుడు పీహెచ్‌సీకి వెళితే వైద్యులే కనిపించేవారు కాదు. నాలుగేళ్లలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి ఇద్దరు వైద్యులను నియమించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితిలోనైనా అక్కడే వైద్యం అందించేలా ఏర్పాటు చేశారు. దీంతో పాటు వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు ఏర్పాటు చేసి మిడ్‌లెవెల్ హెల్త్‌ప్రొవైడర్‌ను నియమించారు. దీంతో తమ సొంత గ్రామంలోనే వైద్యం అందే పరిస్థితులు కల్పించారు.





గ్రామ వార్డు సచివాలయాలతో

సచివాలయ వ్యవస్థ దేశంలోనే ఒక చరిత్ర. ప్రభుత్వాఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే సంప్రదాయానికి జగన్ సర్కార్ స్వస్తి పలికింది. ప్రతి రెండువేల మంది జనాభాకు గ్రామ/వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసింది. ఎలాంటి సమస్యనైనా గ్రామం నుంచే పరిష్కరించుకునేలా చేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1,207 సచివాలయాలను ఏర్పాటు చేసింది. రేషన్ కార్డు నుంచి ఇంటిపట్టా వరకూ అన్ని పనులకూ సచివాలయమే వేదిక అయ్యింది. అలాగే వేలాది మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించింది.

ఉమ్మడి జిల్లాలో వార్డు/గ్రామ సచివాలయాల్లో ఉద్యోగాలు	
అనంతపురంలో	
గ్రామ/వార్డు సచివాలయాలు	663
మంజూరైన పోస్టులు	11,585
పనిచేస్తున్న వారు	11,461
శ్రీసత్యసాయి జిల్లాలో	
గ్రామ/వార్డు సచివాలయాలు	544
మంజూరైన పోస్టులు	11,585
పనిచేస్తున్న వారు	11,461



పంటల బీమా మెగా చెక్ విడుదల చేస్తున్న సీఎం వైఎస్ జగన్ (ఫైల్)

రైతుకు భరోసా

రైతే రాజు అని అని నమ్మిన ప్రభుత్వమిది. వైఎస్సార్ రైతు భరోసా పేరిట (పీఎం కిసాన్) పేరుతో 5.76 లక్షల మంది రైతుల ఖాతాల్లో ఏడాదికి రూ.728 కోట్ల చొప్పున నాలుగేళ్లలో రూ.3 వేల కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ అయ్యింది. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద గత ఏడాది రికార్డు స్థాయిలో ఉమ్మడి అనంతపురం జిల్లాకు రూ.855 కోట్లు మంజూరైంది. మూడేళ్లలో రూ.1,200 కోట్లకుపైగా అందింది. వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల కింద రూ.120 కోట్ల మేర రైతులకు అందింది. అలాగే ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.250 కోట్లు, ఆత్మహత్యలు చేసుకున్న రైతులకు రూ.14 కోట్లు అందజేసింది. డ్రిప్, స్ప్రింక్లర్లు కింద రూ.350 కోట్లు వ్యయం చేసింది. విత్తనం వేరుశనగ, పప్పుశనగ సబ్సిడీ కింద జగన్ సర్కార్ నాలుగేళ్లలో ఏకంగా రూ.500 కోట్లు వ్యయం చేసింది.

నాలుగేళ్లలో ఉమ్మడి జిల్లా రైతులకు చేకూరిన లబ్ధి	
వైఎస్సార్ రైతు భరోసా -పీఎం కిసాన్	రూ.1,557 కోట్లు
రైతు ఆత్మహత్యలకు పరిహారం	రూ.12 కోట్లు
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	రూ.978 కోట్లు
పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్‌సబ్సిడీ)	రూ.128 కోట్లు
వైఎస్సార్ పంటరుణాల సున్నావడ్డీ	రూ.54 కోట్లు
విత్తన రాయితీలు	రూ.290 కోట్లు
డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీ	రూ.275 కోట్లు
సీహెచ్‌సీల కింద ట్రాక్టర్లు, పరికరాలు	రూ.27 కోట్లు
వ్యవసాయ, అనుబంధ పథకాలకు	రూ.120 కోట్లు



నాలుగేళ్లలో లక్ష మందికి పైగా..

వైఎస్సార్ ప్రవేశపెట్టిన 108 అంబులెన్సు వ్యవస్థ 2019 నాటికి పూర్తిగా నిర్వీర్యమైంది. దీంతో బాధితులు బిక్కు బిక్కుమనే పరిస్థితి. దీంతో అధికారంలోకి వచ్చీరాగానే జగన్ సర్కారు 108 వ్యవస్థపై దృష్టి సారించింది. మండలానికొక 108 అంబులెన్సును ఏర్పాటు చేసింది. దీంతో ఏ రాష్ట్రంలో లేని విధంగా సర్వీసులు మెరుగు పడ్డాయి. దీనికి తోడు మండలానికొక 104 వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఇంటివద్దకే వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నాయి. కరోనా సమయంలో 108 అంబులెన్సులే పెద్దదిక్కుగా ఉన్నాయి.

2020-23 మధ్య అంబులెన్సుల వ్యవస్థ ఇలా	
మొత్తం అంబులెన్సులు	66
ఏఎల్ఎస్	15
బీఎల్ఎస్	49
నియోనేటల్	02
ఎమర్జెన్సీ టెక్నీషియన్స్	165
డ్రైవర్స్	165
లబ్ధిదారుల సంఖ్య	2,90,645



పారిశ్రామికాభివృద్ధి పరుగులు

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పారిశ్రామిక వృద్ధి పరుగులు పెడుతోంది. సరళీకృత పారిశ్రామిక విధానాలను అమల్లోకి తేవడంతో ఇతర రాష్ట్రాల పెట్టుబడిదారులు కూడా ఇక్కడకు వస్తున్నారు. వేలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు.

అనంతపురం జిల్లాలో పరిశ్రమలు ఇలా	
పెద్ద ప్రాజెక్టులు	02
పెట్టుబడులు	712.8 కోట్లు
ఉద్యోగాలు	526
ఎంఎస్ఎంఈలు	7,540
పెట్టుబడులు	749.25 కోట్లు
ఉద్యోగాలు	52,659
శ్రీసత్యసాయి జిల్లాలో	
పెద్ద ప్రాజెక్టులు	22
పెట్టుబడులు	రూ.14,970 కోట్లు
ఉద్యోగాలు	12,785
ఎంఎస్ఎంఈలు	1,532
పెట్టుబడులు	రూ.674 కోట్లు
ఉద్యోగాలు	11,312



లబ్ధిదారులకు స్వర్ణయుగం

వైఎస్సార్ సీపీ హయాంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని లబ్ధిదారులు స్వర్ణయుగం చూస్తున్నారు. వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరిమహిళలు వంటివారికి నెలనెలా వేతనం తరహాలోనే వలంటీర్లు ఇంటికొచ్చి సొమ్ములిస్తున్నారు. రూ.2వేలతో పెన్షన్ మొదలై హామీ ఇచ్చిన మాదిరే రూ.2,750 వరకూ వెళ్లింది. వచ్చే జనవరిలో రూ.3 వేలకు పెంచుతానని ఇప్పటికే ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

అనంతపురం జిల్లాలో	
లబ్ధిదారుల సంఖ్య	2,76,640
నెలకు వ్యయం	రూ.77.283 కోట్లు
ఏడాదికి వ్యయం	రూ.857.96 కోట్లు
శ్రీసత్యసాయి జిల్లాలో	
లబ్ధిదారుల సంఖ్య	2,65,194
నెలకు వ్యయం	రూ.73.62 కోట్లు
ఏడాదికి వ్యయం	రూ.823.41 కోట్లు



ఆరోగ్యశ్రీకి మహర్దశ

ఆరోగ్యశ్రీకి జగన్ సర్కార్ ప్రాణం పోసింది. గతంలో ఆరోగ్యశ్రీ పరిధిలో ఉన్న 1,058 చికిత్సలను ఇప్పుడు ఏకంగా 3,255కు పెంచింది. ఎక్కడా పైసా అడగకుండా చేసింది. ఇప్పుడు కాన్పులను కూడా ఆరోగ్యశ్రీలో చేర్చడంతో గ్రామీణ మహిళలకు రూపాయి ఖర్చు లేకుండా పోయింది. కేన్సర్, గుండె, నరాల జబ్బులకు ఇతర రాష్ట్రాల్లోనూ వైద్యానికి అవకాశం కల్పించారు.

ఆరోగ్యశ్రీలో చికిత్సలు	3,255
నాలుగేళ్లలో లబ్ధిదారులు	1,96,165
ఖర్చు చేసిన వ్యయం	రూ.455.08 కోట్లు

అందరికీ పక్కా ఇళ్లు

టీడీపీ సర్కార్ టిడ్కో ఇళ్లపేరిట ప్రజలను మోసం చేసింది. జగన్ సర్కార్ ఇప్పుడు స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం చేస్తోంది. ఉమ్మడి జిల్లాలో జగనన్న కాలనీల పేరిట ఊళ్లకు ఊళ్లే వెలిశాయి. తాగునీళ్లు, రోడ్లు, కరెంటు ఇలా అన్నీ ఉచితంగా వేసి పేదలకు కొత్త కాలనీలు నిర్మిస్తున్నారు.

అనంతపురం జిల్లాలో	
మంజూరైన ఇళ్లు	60803
100 శాతం పూర్తయినవి	13500
రూఫ్ లెవెల్ ఉన్నవి	3వేలు
బేస్‌మెంట్ లెవెల్	19600
బేస్‌మెంట్ లెవెల్ కంటే తక్కువగా	20 వేలు
శ్రీసత్యసాయి జిల్లాలో	
జిల్లాలో మంజూరైన ఇళ్లు	66,965
నిర్మాణాలు ప్రారంభించినవి	62,253
పూర్తి అయినవి	10,717
గ్రౌండింగ్ అయినవి	54,878

అర్జీలకు సత్వర పరిష్కారం చూపండి

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం
- వివిధ సమస్యలపై 409 వినతులు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్పందన కార్యక్రమంలో ప్రజలు అందజేసే అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారాలను సత్వరమే చూపాలని అధికారులను కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ సమస్యలపై 409 అర్జీలను ప్రజలు అందజేశారు. అర్జీలను కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రిదేవి, ఆర్‌డీఓ మధుసూదన్, హౌసింగ్ పీడీ కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు స్వీకరించారు. అనంతరం స్పందన అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పరిష్కారం కాకపోయినా పరిష్కరించినట్లుగా కొందరు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని, దీంతో అర్జీ రీ–ఓపెన్ అవుతుందన్నారు. ఏదేని సమస్య పరిష్కారం కానిదైతే అదే విషయాన్ని అర్జీదారునికి తెలిజేస్తూ ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. ఈ విషయంగా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కొన్ని వినతులు ఇలా...

- చాకోలెట్ సిస్ట్ అండ్ సి ఫైబర్ వ్యాధితో బాధపడుతున్న తనకు ఆపరేషన్ చేయించి ప్రాణాలు కాపాడాలని అనంతపురంలోని ఆరో రోడ్డుకు చెందిన దిల్‌షాద్ విన్నవించారు. హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చూపించుకుంటే ఆపరేషన్‌కు రూ.5 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు వివరించినట్లు తెలిపారు.
- కుల ధ్రువీకరణ లేని కారణంగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు తమకు అందడం లేదని రాజ్‌గోండ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా తమ పిల్లలకు పెద్ద చదువులు చెప్పించలేని పరిస్థితి ఉందని వాపోయారు. 40 ఏళ్ల క్రితం మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన 70 కుటుంబాలకు చెందిన తాము అనంతపురం శివారులోని నేషనల్ పార్క్ వద్ద స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నామని వివరించారు. గుంటూరు, విజయవాడలో రాజ్‌గోండ్‌లను ఎస్టీలుగా గుర్తిస్తూ కుల ధ్రువీకరణ పత్రం జారీ చేస్తున్నారని, ఆ దిశగా ఇక్కడ కూడా తమకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని విన్నవించారు.
- డ్వామాలో కాంట్రాక్ట్ అగ్రిమెంట్‌తో ఎఫ్‌టీఈలుగా 17 ఏళ్లగా పనిచేస్తున్న తమను 2006 హెచ్‌ఆర్ పాలసీ మేరకు కొనసాగించేలా చూడాలని కలెక్టర్ గౌతమికి ఎంజీఎన్ ఆర్‌ఈజీఎస్ జేఏసీ అధ్యక్షుడు రామాంజినేయులు, కార్యదర్శి బాషా, ఉపాధ్యక్షుడు, సునీల్‌కుమార్, తదితరులు విన్నవించారు. కాంట్రాక్ట్ అగ్రిమెంట్ కింద 2006 హెచ్‌ఆర్ పాలసీతో వివిధ కేటగిరిల్లో ఎఫ్‌టీఈ (ఫుల్ టైమ్ ఈక్వలెంట్)లుగా పనిచేస్తున్న తమ ఉద్యోగాలను ఏటా రెన్యువల్ చేస్తున్నారన్నారు. తాజాగా కొత్త హెచ్‌ఆర్ పాలసీ మేరకు కొత్తగా అగ్రిమెంట్ చేసుకోవాలని చెబుతున్నారని, దీంతో 17 ఏళ్ల సర్వీస్‌ను కోల్పోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. 2006 పాలసీ ప్రకారం కొనసాగించేలా తమ వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

పోలీసు శాఖలో పారదర్శక బదిలీలు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఈ ఏడాది ఏప్రిల్ 30 నాటికి ఒకే పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న 71 మందిని ఎస్పీ కె. శ్రీనివాసరావు పారదర్శకంగా బదిలీ చేశారు. సోమవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో బదిలీల ప్రక్రియను ఆయన చేపట్టారు. 61 మంది కానిస్టేబుళ్లు, ఆరుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, నలుగురు ఏఎస్‌ఐలకు స్థాన చలనం కల్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్ విజయభాస్కరరెడ్డి, జిల్లా పోలీసు పరిపాలనాధికారి శంకర్, జిల్లా పోలీసు అడహక్ కమిటీ సభ్యులు త్రిలోక్‌నాథ్, సుధాకరరెడ్డి, శ్రీనివాసులనాయుడు, శివప్రసాద్ పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తన సరఫరానే లక్ష్యం

- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



సబ్సిడీ విత్తన వేరుశనగను పంపిణీ చేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్, తదితరులు

కళ్యాణదుర్గం/అనంతపురం అగ్రికల్చర్: రైతులను సంతోషంగా చూడాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. ఈ క్రమంలో వ్యవసాయాన్ని పండుగ చేసేందుకు నాణ్యమైన విత్తన సరఫరా చేపట్టారని తెలిపారు. కళ్యాణదుర్గం మండలం పాలవాయిలో ఖరీఫ్ రాయితీ విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్‌తో కలసి సోమవారం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. టీడీపీ హయాంలో విత్తన కాయల కోసం రైతులు రోజుల తరబడి వేచి చూసేవారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగనన్న బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆర్‌బీకే వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి, విత్తనం మొదలు పంట దిగుబడి విక్రయం వరకూ అన్ని సేవలను రైతు ముంగిటకే చేరువ చేశారన్నారు.

మేనిఫెస్టోలో ఉచిత పథకాల మాటేంటి బాబూ?

2019 ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ పేర్కొన్న మేనిఫెస్టోలోని హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ సర్కార్ నెరవేరుస్తుంటే ఉచిత పథకాలతో రాష్ట్రం మరో శ్రీలంక అవుతుందని ఎద్దేవా చేసిన చంద్రబాబు... తాజాగా మహానాడులో ఉచిత పథకాల పరంపరను ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని మంత్రి విమర్శించారు. మరో శ్రీలంక అయ్యే పరిస్థితులుంటే చంద్రబాబు తన మేనిఫెస్టోలో ఉచిత పథకాలు ఎలా పొందుపరిచారంటూ ప్రశ్నించారు.

తొలిరోజు 3,113 క్వింటాళ్లు పంపిణీ

తొలిరోజు జిల్లా వ్యాప్తంగా 3,459 మంది రైతులకు 3,113 క్వింటాళ్లు పంపిణీ చేసినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.చంద్రానాయక్ తెలిపారు. విత్తన వేరుశనగతో పాటు కందులు, కొర్రలు, రాగులు, మినుములు, పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ కూడా మొదలుపెట్టారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఆర్డీఓ శంకరయ్య, ఎంపీడీఓ బాలాజీ, స్థానిక సర్పంచ్ నాగరత్నమ్మ, ఎంపీపీ మారుతమ్మ, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ తిమ్మరాజమ్మ, వైస్ చైర్మన్ రామ్మోహన్, ఎంపీటీసీ లింగమ్మ, నాయకులు గోపాల్, గోవిందు, పాతన్న తదితరులు పాల్గొన్నారు.

2024లోనూ జగనన్నే సీఎం

కళ్యాణదుర్గం: రాబోవు ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 175 స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుని, 2024లో జగనన్నే ముఖ్యమంత్రి అవుతారని మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి మంగళవారంతో నాలుగేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ నాలుగేళ్లలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసి చూపించామన్నారు. అధికారం చేపట్టినప్పటి నుంచి సంక్షేమ పథకాల కాలెండర్‌ను అనుసరిస్తూ నేరుగా లబ్ధిదారుల ముంగిటకే సంక్షేమ ఫలాలను సీఎం వైఎస్ జగన్ అందజేస్తున్నారన్నారు. దీంతో ప్రతి ఇంట్లో జగనన్న వెలుగై నిలిచారన్నారు. అభినవ అంబేడ్కర్‌గా, పూలేగా పేదలు కొనియాడుతున్నారన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ తదితర కార్యక్రమాలు ప్రజల గుండె చప్పుడు జగనేనని స్పష్టం చేశాయన్నారు.

ఏ ఒక్క విద్యార్థీ ఇబ్బంది పడకూడదు

రాప్తాడు రూరల్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో ఏ ఒక్క విద్యార్థీ ఇబ్బంది పడకుండా అన్ని కేంద్రాల్లోనూ వసతులు కల్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరామ్ ఆదేశించారు. అనంతపురంలోని కేఎస్‌ఆర్ బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జూన్ 2 నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రశ్నపత్రాలు మంగళవారం జిల్లాకు వస్తాయని, మరుసటి రోజు పోలీస్ స్టేషన్లకు తరలిస్తామన్నారు. ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్, డీవైఈఓలు పద్మప్రియ, శంకర ప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జగన్ నాలుగేళ్ల పాలనపై సంబరాలు

అనంతపురం క్రైం: సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు తీసుకొని నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా పార్టీ కార్యాలయంలో మంగళవారం సంబరాలు జరుపుకోనున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే కార్యాలయం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు కేక్ కట్ చేయనున్నట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

పౌష్టికాహారం తప్పనిసరిగా అందించండి


ఆత్మకూరు సెంటర్ -4 లో విచారిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి

ఆత్మకూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో తప్పనిసరిగా పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సీడీపీఓ ధనలక్ష్మి తెలిపారు. ఈ నెల 27న 'సాక్షి'లో 'లబ్ధిదారులకు చేరని పౌష్టికాహారం' శీర్షికన కథనం ప్రచురితమైంది. సోమవారం ఐసీడీఎస్ అధికారులు స్పందించి మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం లబ్ధిదారులను పౌష్టికాహారం సక్రమంగా ఇస్తున్నారా ? లేదా అని తెలుసుకున్నారు. పౌష్టికాహారం పంపిణీలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నేతాజీబీ పాల్గొన్నారు.

2 నుంచి టెన్త్ సప్లిమెంటరీ

- జిల్లాలో 49 పరీక్ష కేంద్రాల ఏర్పాటు
- హాజరుకానున్న 14,665 మంది విద్యార్థులు
- 49 మంది సీఎస్‌లు, 49 మంది డీఓలు, 500 మంది ఇన్విజిలేటర్ల నియామకం

రాప్తాడురూరల్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జూన్ రెండు నుంచి పదో తేదీవరకు జరగనున్నాయి. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 49 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 14,465 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ప్రతి కేంద్రానికీ ఒక ఇన్విజిలేటర్, చీఫ్ సూపరింటెండెంట్‌ను నియమించారు. దాదాపు 500 మందిని ఇన్విజిలేటర్ విధులకు కేటాయించారు. ఇప్పటికే పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చకచకా జరుగుతున్నాయి. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రతి గదిలోనూ ఫ్యాన్లు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని కేంద్రాల్లో సదుపాయాలు కల్పిస్తున్నారు. ముఖ్యంగా ఫర్నిచర్, లైటింగ్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేసేలా చర్యలు తీసుకుంటున్నారు. అన్ని కేంద్రాల్లోనూ వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరు. నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. పరీక్షలు జరిగే సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ బయటి వ్యక్తులకు లోనికి ప్రవేశం లేదు.

ఏర్పాట్లు పూర్తి

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లూ చేశాం. విధులకు నియమించిన సిబ్బంది జాగ్రత్తగా ఉండాలి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకోవాలి. ఏమాత్రం అలసత్వం వహించినా ఇబ్బంది పడతారు. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. – సాయిరామ్, డీఈఓ.

అందరి సహకారంతోనే ఆర్‌ఓబీ

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి


విద్యుత్ దీపాల అలంకరణలో ఓవర్ బ్రిడ్జి


లైట్లు ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంటరామిరెడ్డి, చిత్రంలో కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి, కోగటం విజయభాస్కర్‌రెడ్డి

అనంతపురం క్రైం: ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా.. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, కేంద్ర రవాణాశాఖ మాత్యులు నితిన్ గడ్కరీ, కేంద్ర టాన్స్‌పోర్టు కార్యదర్శి, ప్రస్తుత డిఫెన్స్ కార్యదర్శి గిరిధర్, అప్పటి రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు కార్యదర్శి కృష్ణబాబు, చీఫ్ బ్రిడ్జెస్ ఇంజినీర్ సౌత్ సెంట్రల్ రైల్వేస్ ఆర్.రామకృష్ణ, డీఆర్ఎం రమణారెడ్డి, ఆర్‌ఓ ఎస్‌కే సింగ్, జిల్లా అధికార యంత్రాంగం, పోలీసు, ఎన్‌హెచ్, ఎస్ఆర్‌సీ, ప్రజా సంకల్పంతో రైల్వే ఓవర్ బ్రిడ్జ్ సాధ్యమైందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాత్రి టవర్‌క్లాక్ సర్కిల్‌లో ఆర్‌ఓబీ లైటింగ్ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, కలెక్టర్ ఎం.గౌతమి పాల్గొని, లైట్లు ఆన్ చేశారు. భారీ ప్రొజెక్టర్ల ద్వారా లైటింగ్ కార్యక్రమాన్ని వీక్షించేలా ఎమ్మెల్యే చర్యలు తీసుకున్నారు. చివరిలో శివకోటి ఆలయ గోపురాన్ని అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 12 అడుగులు వెనక్కు జరపడం, ఆర్‌ఓబీ పనులు ఏవిధంగా చేశారన్న వీడియోలను ప్రదర్శించారు. లైట్ల ఓపెనింగ్ సమయంలో అర గంటపాటు బాణా సంచా పేల్చారు. ఓవర్‌బ్రిడ్జ్ వెలుగులు, బాణా సంచా పేలుతున్న దృశ్యాలను నగర ప్రజలు సెల్‌ఫోన్లలో బంధించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తాత్కాలికంగా బ్రిడ్జ్‌పై రాకపోకలు మాత్రమే ప్రారంభిస్తున్నామన్నారు. సప్తగిరి సర్కిల్, శాంతి థియేటర్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ ల్యాండ్ అక్విజేషన్ చేసుకొని, మరో మూడు, నాలుగు నెలల్లో పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. రాబోయే 70 ఏళ్ల జనాభా పెరిగినా ఇబ్బందులు లేకుండా ఈ ప్రాజెక్ట్‌లోనే రోడ్డు అండర్ బ్రిడ్జ్ పనులు పూర్తి చేస్తామన్నారు.

రూ.311.93 కోట్లకు పెంపు

గతంలో నేషనల్ హైవే పరిధిలో ఉన్న రోడ్డును అప్పటి టీడీపీ ప్రభుత్వం స్వార్థ రాజకీయాల కోసం ఆర్‌అండ్‌బీ పరిధిలోకి తీసుకొచ్చిందని, అయితే తాను ఎంపీగా పనిచేసినపుడు ఉన్న పరిచయాలతో అప్పటి కేంద్ర రవాణా కార్యదర్శి గిరిధర్‌ను కలిసి సమస్యను వివరించానని ఎమ్మెల్యే అనంత తెలిపారు. ఆయన ప్రమేయంతో వన్ టైం డెవలప్‌మెంట్ పేరిట రూ.90 కోట్లతో సింగిల్ బ్రిడ్జిని మంజూరు చేసినట్లు తెలిపారు. కానీ మనసులో ఏదో వెలితి ఉండేదన్నారు. మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి హయాంలో 1965లో ప్రారంభించిన బ్రిడ్జి ప్రస్తుతం శిథిలావస్థకు చేరిందని, ఈ బ్రిడ్జిని మరింత విస్తరించేందుకు ఎమ్మెల్యేగా తాను, ఎంపీ తలారి రంగయ్య ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి విన్నవించినట్లు తెలిపారు. కోవిడ్ విపత్కర పరిస్థితిలో ఆన్‌లైన్‌లోనే కనకదుర్గ ఫ్లై ఓవర్‌ను గడ్కరీ ప్రారంభించారని, అదే సమయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బ్రిడ్జిని రూ.350 కోట్ల ప్రాజెక్ట్ చేయాలని విన్నవించగా.. వెంటనే అక్కడికక్కడే కేంద్ర మంత్రి బ్రిడ్జి మంజూరు చేశారన్నారు. సొంతింటి నిర్మాణంలా ఆర్‌ఓబీ ఏర్పాటులో రైల్వే, రెవెన్యూ, పోలీసు, ఎన్‌హెచ్, నగరపాలక సంస్థ, ఎస్ఆర్‌సీ కృషి చేశారని వారందరికీ ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

చెరువుకట్టకు రోడ్డు, నడిమివంకకు రక్షణ గోడలు..

చెరువుకట్టపై భారీ వాహనాలు వెళ్లేలా, ట్రాఫిక్ సమస్య లేకుండా ఉండేందుకు రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు ఖర్చు అవుతుందని ఎమ్మెల్యే చెప్పగా, అందుకు కలెక్టర్ గౌతమి సానుకూలంగా స్పందించి, విశాలమైన రోడ్డు, గ్రీనరీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు నడిమివంకకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రక్షణ గోడలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ గౌతమి సభా ముఖంగా హామీ ఇచ్చారు. ఎన్‌హెచ్ అర్బన్ లింక్ రోడ్డును తానెక్కడా చూడలేదని, ఇలాంటి రోడ్డు మంజూరు అంశాలు చాలా అరుదుగా జరుగుతాయన్నారు. నిజంగా ఇది గొప్ప విషయమన్నారు. ఓవర్ బ్రిడ్జి, అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ), మధ్యలో రైల్వే ట్రాక్ ఇలాంటి చక్కటి ప్రాజెక్ట్‌ను కాలయాపన లేకుండా అనతి కాలంలోనే ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. బెంగుళూరు నగరం తరహాలో అనంతపురాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. ఎమ్మెల్యే, కలెక్టర్, జేసీ, రైల్వే అధికారులు ఎస్ఆర్‌సీ అధినేత అమిలినేని సురేంద్రబాబు, సభ్యులు అవినాష్, తదితరులను వైఎస్సార్ సీపీ సీనియర్ నేత తోపుదుర్తి భాస్కర్ రెడ్డి శాలువా, పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, ఆర్డీఓ మధుసూదన్, నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.


గుమ్మడికాయలతో హారతి ఇస్తున్న దృశ్యం


ఓవర్ బ్రిడ్జిపై బాణాసంచా కాలుస్తున్న దృశ్యం

కలెక్టర్‌ను కలిసిన ఏపీఎస్‌సీసీఎఫ్‌సీ ఎండీ


కలెక్టర్ గౌతమికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏపీఎస్‌సీసీఎఫ్‌సీ ఎండీ చిన్నరాముడు

అనంతపురం అర్బన్: ఏపీఎస్‌సీసీఎఫ్‌సీ (ఆంధ్ర ప్రదేశ్ షెడ్యూల్ క్యాస్ట్స్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్) మేనేజింగ్ డైరెక్టర్ చిన్నరాయుడు సోమవారం జిల్లా పర్యటనకు వచ్చారు. రాప్తాడు మండలం హంపాపురంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఆయన కలెక్టరేట్ చేరుకొని రెవెన్యూభవన్‌లోని ప్రత్యేక చాంబర్‌లో కలెక్టర్ ఎం.గౌతమిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


రాప్తాడులో రైతులకు వేరుశనగ కాయలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి

రాప్తాడు: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం రైతు భరోసా కేంద్రంలో విత్తన వేరుశనగ కాయల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు విత్తన వేరుశనగ కాయలను ఎంపీపీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ శుభకర్, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, బీసీ సెల్ నాయకుడు పసుపుల ఆది, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నారాయణ స్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు నరసింహ రెడ్డి, చిరుతల నాగేంద్ర, రవి కుమార్, వీఏఏ శ్రీనివాసులు, వీహెచ్ఏ సోనియా పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ విత్తన వేరుశనగ అందాలి

రాప్తాడు: ప్రభుత్వ సబ్సిడీ వేరుశనగ అర్హులైన ప్రతి రైతుకూ అందాలని ఏడీఏ వెంకటరాముడు సూచించారు. సోమవారం ఆయన మండలంలోని హంపాపురం రైతు భరోసా కేంద్రంలో జరుగుతున్న విత్తన పంపిణీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. నాణ్యతలేని వేరుశనగ కాయలు వెనక్కు పంపాలని ఏఓ శుభకర్‌కు సూచించారు. అనంతరం ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్‌లో స్పీక్ కంపెనీకి సంబంధించిన ఎరువులను పరిశీలించారు.


బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత, నాయకులు, కార్యకర్తలు


బైక్ ర్యాలీలో యువతీ యువకుల సందడి

సందడే సందడి

అనంతపురం క్రైం: టవర్‌క్లాక్ బ్రిడ్జి ప్రారంభంతో అనంతపురంలో సందడి నెలకొంది. జనాభాకు అనుగుణంగా, ట్రాఫిక్ సమస్యను అధిగమించేలా టవర్‌క్లాక్ నుంచి పీటీసీ వరకు నాలుగు వరసలతో నిర్మించిన నూతన బ్రిడ్జిపై ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీతో సోమవారం రాకపోకలు ప్రారంభించారు. ఈలలు, కేకలు, జై జగన్, జై అనంత నినాదాలతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు బైక్ ర్యాలీని ఆసాంతం హుషారెత్తించారు. కార్యక్రమంలో మేయర్ వసీం, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు అనంత చంద్రారెడ్డి,అనంత సుబ్బారెడ్డి, తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, కొర్రపాడు హుస్సేన్‌పీరా, శ్రీదేవి, ఎగ్గుల శ్రీనివాసులు, సోమశేఖర్‌రెడ్డి, కృష్ణవేణి, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, నాయకులు గౌస్‌బేగ్, రిలాక్స్ నాగరాజు, నార్పల సత్యనారాయణరెడ్డి, పెన్నోబులేసు, రాధాకృష్ణ, దేవి, భారతి, అనిల్‌కుమార్ గౌడ్, కార్పొరేటర్లు సాకే చంద్ర, చంద్రమోహన్‌రెడ్డి, గురుశేఖర్‌బాబు, ఇస్సాక్, రహంతుల్లా, సుజాత, జయలలిత, రాజేశ్వరి, కోఆప్షన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


బైక్ ర్యాలీలో పాల్గొన్న మహిళా కార్యకర్తలు


జై జగన్ అంటూ నినాదాలు చేస్తున్న డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య


బైక్ ర్యాలీలో పాల్గొన్న అభిమానుల సందడి

బాలిక అదృశ్యం


హారిక (ఫైల్)

రాప్తాడురూరల్: ఇంట్లోని రూ. 50 తీసుకుందని అవ్వాతాతలు దండించడంతో మనవరాలు ఇంటి నుంచి పారిపోయిన ఘటన సోమవారం రాత్రి అనంతపురం రూరల్ మండలం దండోరాకాలనీలో చోటు చేసుకుంది. సీఐ విజయభాస్కర్‌గౌడ్ తెలిపిన మేరకు.. దండోరాకాలనీలో నివాసం ఉంటున్న భాస్కర్ నాయక్ కూతురు సుగాలి హారిక (11) ఇంట్లో తెలీకుండా రూ. 50 తీసుకుంది. డబ్బు తీసుకోవడం తప్పని అమ్మమ్మ, తాతయ్య దండించారు. అవమానంగా భావించిన బాలిక సాయంత్రం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా బాలిక ఆచూకీ లభించలేదు. దీంతో రాత్రి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక ఆచూకీ తెలిస్తే సీఐ (94407 96811), ఎస్ఐ (93469 17101)కు సమాచారం అందించాలని సీఐ కోరారు.

శివబాల నోరు అదుపులో పెట్టుకో

- గొర్రెలు, మేకల కార్పొరేషన్ చైర్మన్ నరసింహులు గౌడ్



విలేకరులతో మాట్లాడుతున్న గొర్రెలు, మేకల కార్పొరేషన్ చైర్మన్ నరసింహులు గౌడ్

అనంతపురం టవర్‌క్లాక్: టీడీపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని, రాజకీయ లబ్ధికోసం వైఎస్సార్‌సీపీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపైన లేనిపోని ఆరోపణలు చేయడం తగదని గొర్రెలు, మేకల కార్పొరేషన్ చైర్మన్ నరసింహులు గౌడ్ హెచ్చరించారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. టీడీపీ మహానాడు వేదికపై చంద్రబాబు నాయుడు మెప్పు కోసం టీడీపీ నాయకురాలు శివబాల నోటికొచ్చినట్లు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తన భర్త, బావను చంపింది వైఎస్సార్‌సీపీ నాయకులు అని అనడం ఏమిటని ప్రశ్నించారు. హత్య చేసిన వారు అదే మహానాడులో ఉండగా, ఇతర పార్టీపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నీ భర్త, బావ దేశనాయకులు కాదని.. వారు కూడా హత్యలు చేసిన వారే అన్నారు. మీ వారు వైఎస్సార్ సీపీ నాయకుడు భాస్కర్‌రెడ్డిని హత్య చేసిన విషయం తెలియదా? అని ప్రశ్నించారు. కురుబ కులం అడ్డుపెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నావని, అందుకు చంద్రబాబు కాళ్లు పట్టుకోవాలేగానీ ఇతరులపై నిందలు వేయడం సరికాదన్నారు. మహానాడును కేవలం ముఖ్యమంత్రి జగన్‌ను తిట్టడానికే పెట్టారన్నారన్నారు. నారా లోకేష్‌కు తెలుగు రాదు.. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాదని తేల్చి చెప్పారు. టీడీపీని నమ్మి డబ్బు పోగొట్టుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో రాప్తాడు జెడ్పీటీసీ ఆది, వైఎస్సార్‌సీపీ నాయకులు వసికేరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణపై ర్యాలీ

రాప్తాడురూరల్: నగరంలోని ఎస్వీ డిగ్రీ,పీజీ కళాశాల విద్యార్థులు నీటి సంరక్షణపై అవగాహన కల్పిస్తూ సోమవారం ర్యాలీ నిర్వహించారు. కళాశాల చైర్మన్ సోమశేఖర్‌రెడ్డి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకనుగుణంగా నీరు వృథాచేయకుండా వాడుకోవాలన్నారు. భూమిపై ఉన్న ప్రతిజీవీ నీటిపై ఆధారపడి ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో నీటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మధుసూదన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, ఏఓ సాయినాథ్, ఎన్ఎస్ఎస్ అధికారులు ఆనంద్‌బాబు, పురుషోత్తం పాల్గొన్నారు.

ఫేక్ పట్టాలపై నేడు విచారణ

- తొలివిడతగా 25 మందికి నోటీసులు జారీ చేసిన రెవెన్యూ అధికారులు
- ఫేక్ పట్టాల రద్దుకు కొన్ని రోజులుగా పోరాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి
- విజిలెన్స్‌తో విచారణ చేయించాలంటూ గత మార్చిలో అసెంబ్లీలో కోరిన ఎమ్మెల్యే



అనంతపురం తహసీల్దార్ కార్యాలయం

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలంలో ఫేక్ పట్టాలతో భూములు దక్కించుకున్న వారిలో గుబులు రేగింది. కొంతకాలంగా ఫేక్ పట్టాలను రద్దు చేయాలంటూ రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేపట్టిన పోరాటానికి ఫలితం దక్కింది. స్పందించిన కలెక్టర్ గౌతమి ఆదేశాలతో అనంతపురం రూరల్ మండలం కురుగుంట, రాచానపల్లి, సోములదొడ్డి, కొడిమి, కామారుపల్లి, ఇటుకలపల్లి, కందుకూరు, ఉప్పరపల్లి పరిధిలో ఫేక్ పట్టాలు పొందిన వారిలో తొలివిడతగా 25 మందికి రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. వీరంతా మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగే విచారణకు హాజరుకానున్నారు. విచారణకు గైర్హాజరైతే కార్యాలయంలోని రికార్డుల మేరకు ఫేక్ పట్టాలు పొందిన వారిపై తదుపరి చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో స్పష్టం చేశారు.

టీడీపీ హయాంలో అక్రమాలు

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అనంతపురం రూరల్ మండలంలో రెవెన్యూ అధికారుల సహకారంతో రూ. కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములకు ఫేక్ పట్టాలు సృష్టించి కొందరు కొల్లగొట్టారు. సాగుభూములకు పట్టాలివ్వాలంటే కచ్చితంగా అసైన్డ్‌మెంట్ కమిటీ ఆమోదం ఉండాలి. గత ప్రభుత్వంలో అసైన్డ్‌మెంట్ కమిటీ సమావేశమే జరగలేదు. అయినా పెద్ద ఎత్తున భూదందా జరిగింది. తమకు అనుకూలమైన వారికి అప్పనంగా దోచిపెట్టారు. ఈ వ్యవహారం వెనుక రూ.కోట్లు చేతులు మారాయనే ఆరోపణలున్నాయ.

అసెంబ్లీలో కోరిన ఎమ్మెల్యే

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జరిగిన భూదందాపై విజిలెన్స్‌తో విచారణ చేయించాలని పలుమార్లు రెవెన్యూ అధికారులను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కోరారు. ఇదే అంశాన్ని ఈ ఏడాది మార్చి 24న అసెంబ్లీ సమావేశాల జీరో అవర్‌లో ఆయన లేవనెత్తారు. మండల కేంద్రాలకు మూడు కిలోమీటర్ల పరిధిలోని ప్రభుత్వ భూములను సాగుకు కేటాయించకూడదనే నిబంధనను గాలికొదిలేసిన అప్పటి చంద్రబాబు సర్కార్ అనంతపురం రూరల్ మండలంలో రూ.వందల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములకు ఇబ్బడిముబ్బడిగా ఫేక్ పట్టాలిచ్చిందని గుర్తు చేశారు. సాగు చేయకపోయినా, ఆ భూములపై ఎలాంటి హక్కులు లేకపోయినా కొందరు టీడీపీ నాయకులు బినామీల పేర్లు ఎక్కించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన విషయాన్ని వివరించారు. మాజీ సైనికులకు భూములు కేటాయిస్తున్నట్లుగా పాత తేదీలతో రికార్డుల్లోకి ఎక్కించి ఆన్‌లైన్ చేశారన్నారు. ఈ భూదోపిడీపై విజిలెన్స్ విచారణ చేయించాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

కలెక్టర్‌కు నివేదిక ఇస్తాం

అసైన్డ్‌మెంట్ కమిటీ ఆమోదం లేకుండా పలువురు పట్టాలు పొందిన మాట వాస్తవం. వీటిని ఫేక్ పట్టాలుగానే పరిగణించాల్సి ఉంటుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇప్పటికే సంబంధీకులకు నోటీసులు జారీ చేశాం. విచారణ అనంతరం నివేదికను ఆర్డీఓ ద్వారా కలెక్టర్‌కు నివేదిస్తాం. కలెక్టర్ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.
– శ్రీధరమూర్తి, తహశీల్దార్, అనంతపురం

అధికారుల్లో 'స్పందన' కరువు

రాప్తాడురూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'స్పందన'పై అధికారుల్లో చిత్తశుద్ధి లోపిస్తోంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అన్ని శాఖల అధికారులు పాల్గొనాల్సి ఉంది . అయితే ఎక్కువమంది అధికారులు మొక్కుబడిగా రావడం, కాసేపు కూర్చొని వెళ్లడం పరిపాటిగా మారింది. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి 'స్పందన'కార్యక్రమానికి కేవలం నలుగురు అధికారులు మాత్రమే హాజరయ్యారు. తహసీల్దార్ శ్రీధరమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అనంతపురం అర్బన్, రూరల్ ప్రాంతాల నుంచి సమస్యలు చెప్పుకునేందుకు ప్రజలు తరలి వచ్చారు. అధికారుల కుర్చీలు మాత్రం ఖాళీగా దర్శనమిచ్చాయి. డీఆర్‌డీఏ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులు వచ్చినా 12 గంటలకంతా వెళ్లిపోయారు. ఎంపీడీఓ కార్యాలయం ఏఓ 12 గంటల పైన వచ్చారు. ఇక ఐసీడీఎస్ నుంచి వచ్చిన సూపర్‌వైజర్లు జయశ్రీ, హేమలత చివరిదాకా ఉన్నారు. తక్కిన శాఖల నుంచి అధికారులెవరూ రాలేదు. దీనిపై తహసీల్దార్ శ్రీధరమూర్తిని వివరణ కోరగా.. 'స్పందన'కు అధికారులందరూ తప్పకుండా రావాల్సిందే. గైర్హాజరైన అధికారులకు నోటీసులు జారీ చేస్తామన్నారు.

'స్పందన'కు గైర్హాజరైతే ఎలా?

ఆత్మకూరు: ప్రజా సమస్యలు మండలాల్లోనే ఎక్కడికక్కడ పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న 'స్పందన'కు అధికారులు గైర్హాజరయితే ఎలా? అని అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. మండల స్థాయి అధికారులు గైర్హాజరయ్యారు. అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ 'స్పందన'ను అధికారులందరూ హాజరై సక్రమంగా నిర్వహించాలన్నారు.

4న రసాయనశాస్త్రం మాక్ టెస్ట్

రాప్తాడురూరల్: అనంతపురం ఆర్ట్స్ కళాశాల రసాయన శాస్త్ర అధ్యాపకుడు కిరణ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ పీజీసెట్ ఎమ్మెస్సీ రసాయన శాస్త్రం ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు జూన్ 4న మాక్ టెస్ట్ నిర్వహించనున్నారు. మే 1నుంచి ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 267 మంది విద్యార్థులు శిక్షణ పొందారు. వారికి 4న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో సీబీటీ మోడ్ ఐజెడ్ టీచ్‌మింట్ యాప్ ద్వారా మాక్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఏసీఆర్ దివాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు సెల్: 82964 75474లో సంప్రదించాలన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

ఆత్మకూరు: రైతులకు ప్రభుత్వం అండగా ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి , ఎంపీపీ సుబ్బర హేమలత తెలిపారు. సోమవారం మండల వ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు సబ్సిడీ వేరుశనగకాయలు అందించారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వర ప్రసాద్, ఏఈఓ సుజిత,సర్పంచ్ వరలక్ష్మి, వైస్ ఎంపీపీ నీలిమ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వెంకట్రాముడు నాయకులు నరసింహారెడ్డి, కొండారెడ్డి , అతికిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, గోపాల్, రామాంజి, వన్నూరప్ప తదితరులు పాల్గొన్నారు.

జేకేసీపై వర్క్‌షాప్ నిర్వహించండి

అనంతపురం అర్బన్: జగనన్నకు చెబుదాం (జేకేసీ) కార్యక్రమంపై సిబ్బందికి వర్క్‌షాపులు నిర్వహించాలని జిల్లా అధికారులను కలెక్టర్ గౌతమి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్ఓ గాయత్రీదేవితో కలసి అధికారులతో ఆమె సమావేశమై మాట్లాడారు. అర్జీల పరిష్కారంపై సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. సమాచార హక్కు చట్టం కమిషనర్ హరిప్రసాద్‌రెడ్డి మంగళవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అధికారులతో సమావేశం కానున్నారని, ఈ నేపథ్యంలో సరైన సమాచారంతో ఉదయం 9.45కు అధికారులందరూ హాజరు కావాలని ఆదేశించారు. సమావేశం అనంతరం 11 గంటల నుంచి బుధవారం వరకూ దరఖాస్తులపై కమిషనర్ విచారణ చేపడతారన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎస్సీ,ఎస్టీలకు ప్రత్యేక స్పందన నిర్వహించాలి

అనంతపురం అర్బన్: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల కోసం నెలకోసారి ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ ఎం.గౌతమికి కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి నల్లప్ప కోరారు. కలెక్టర్‌ను సోమవారం స్పందన కార్యక్రమంలో ఆయన కలిసి, వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు బుల్లోడు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెటింగ్ శాఖలో ముగ్గురి బదిలీ

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా మార్కెటింగ్ శాఖ పరిధిలో ముగ్గురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు అందినట్లు ఆ శాఖ ఏడీ పి.సత్యనారాయణచౌదరి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏడీఎం ఆఫీస్‌లో జూనియర్ మార్కెటింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న షేక్షావలి.. కర్నూలు జిల్లా ఏడీఎం ఆఫీస్‌కు, రాయదుర్గంలో పనిచేస్తున్న సూపర్‌వైజర్ పోతక్కను తాడిపత్రికి, తాడిపత్రి నుంచి సూపర్‌వైజర్ చంద్రానాయక్‌ను శ్రీసత్యసాయి జిల్లా గోరంట్లకు బదిలీ చేశారు.

భక్తిశ్రద్ధలతో వలీస్వామి ఆరాధన

అనంతపురం కల్చరల్: అవధూత శ్రీ వలీస్వామి 12వ ఆరాధనోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఉదయం వెంకటాపురం గ్రామంలోని స్వామివారి మహాసమాధి వద్ద భక్తులు తరలి వెళ్లి గంధాభిషేకం, శ్రీచందన పూజలు చేశారు. హెచ్చెల్సీ కాలనీలో పెద్ద ఎత్తున సామూహిక భజనలు, వస్త్రదానాలు జరిగాయి.